క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన బాధ్యతల స్వీకారం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి నూతన మున్సిపల్ కమిషనర్‌గా బి.రమ్యకీర్తన గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఈమె కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ డెప్యూటేషన్‌పై కమిషనర్‌గా పనిచేసిన వై.శంకర్ నాయక్ గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మున్సిపాల్టీ, సచివాలయాల ఉద్యోగులు నూతన కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

మదర్ సర్వీస్ సొసైటీ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ గుర్తింపు పొందిన 'మదర్ సర్వీస్ సొసైటీ' స్వచ్ఛంద సేవా సంస్థ ద్వితీయ వార్షికోత్సవ పోస్టర్‌ను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆవిష్కరించారు. గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు తమ కార్యకలాపాలను వివరించారు. మాజీ సీఎం దివంగత ఎన్టీ రామారావు, స్వాతంత్ర్య సమర యోధులు, మహనీయుల పేరుమీద జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 26న విజయవాడలో నిర్వహిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కృష్ణప్రసాద్‌ను వారు ఆహ్వానించారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

కొండపల్లి మున్సిపల్ నూతన కమిషనర్ బి. రమ్య కీర్తన, మైలవరం నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఏపీ సివిల్ సప్లయీస్ డెప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇబ్రహీంపట్నం సీఐ ఎ. చంద్రశేఖర్ గురువారం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని సూచించారు.

ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం

మైలవరం: స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలకపాత్ర పోషించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్విట్ ఇండియా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ రవి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పలికిన డూ ఆర్ డై (సాధించు లేదా మరణించు) నినాదంతో ఈ ఉద్యమం భారత దేశం అంతటా వ్యాపించిందని వివరించారు. కళాశాల చరిత్ర అధ్యాపకులు దారావతు శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎస్కే కరీముల్లా, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి పోలీసుల ఆర్థికసాయం

జి.కొండూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హోం గార్డుగా విధులు నిర్వర్తిస్తున్న కూనపరెడ్డి కృష్ణ (42) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ క్రమంలో జి.కొండూరు ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ రూ.20 వేలు, సిబ్బంది రూ.90 వేలు, మైలవరం సీఐ కె. కిశోర్‌బాబు రూ.20 వేలు, మైలవరం స్టేషన్ సిబ్బంది రూ.30 వేలు, రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ సిబ్బంది రూ.27 వేలు కలిపి మొత్తం రూ.1,87,000 సీఐ కిశోర్‌బాబు చేతులమీదుగా కొండపల్లిలో నివాసం ఉంటున్న బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

ఆరోగ్యంపై అవగాహన

వెల్వడం(మైలవరం): రోజూ తీసుకునే ఆహారం ద్వారా బీపీ, షుగర్‌ను నియంత్రించుకోవచ్చని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ మాధవి అన్నారు. మైలవరం మండలం వెల్వడం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం గురువారం నిర్వహించారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా జ్వరాలు ప్రజలకుండా కాపాడుకోవచ్చన్నారు. ఆరోగ్య రక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ఎంపీపీ స్కూల్‌ను సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్, డాక్టర్ అరుణ, ఏఎన్ఎం, ఆశా వర్కర్స్, 104 ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

తిరువూరు: తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని గంపలగూడెం మండలం మేడూరులో గురువారం అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ అదుపులోకి తీసుకున్నారు. గ్రామానికి చెందిన గవర్రాజు నాగరాజు 48 తెలంగాణ మద్యం సీసాలను తరలిస్తుండగా ఆటోతో సహా స్వాధీనం చేసుకున్నారు. నాగరాజుతో పాటు గతంలో పాత నేరస్తుడు తోట సుబ్బారావును గంపలగూడెం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

వర్షాకాలం.. వ్యాధులతో అప్రమత్తం

- పరిసరాల పరిశుభ్రత అవసరమంటున్న వైద్యులు
- పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాలి
- పిల్లలు వర్షం నీటిలో తడవకుండా జాగ్రత్తలు పాటించాలి



కవులూరులో డ్రైయినేజీ పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



వెలగలేరులో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

జి.కొండూరు: వర్షాకాలం.. వ్యాధుల కాలం. ఈ కాలంలో వ్యాధులు వ్యాపిస్తుంటాయి. ముఖ్యంగా జ్వరాలు, జలుబు, డయేరియా ఇతర సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడుతుంటారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో డయేరియా, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, కాచి చల్లార్చిన నీరు తాగడం, వైద్యుల సూచనలు, సలహాలు పాటించడంతోపాటు పిల్లలు, పెద్దవారు కూడా ఆరోగ్య జాగ్రత్తలు పాటించడం వంటి చర్యలు చేపట్టడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.

చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి తక్కువ..

సాధారణంగా ప్రాథమిక స్థాయి విద్యనభ్యసించే పిల్లల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ వయస్సు పిల్లలు ఎక్కువగా వర్షంలో తడవడానికి, నిల్వ ఉన్న నీటిలో ఆటలు ఆడడానికి ఇష్టపడుతుంటారు. బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే తినుబండారాలను ఎక్కువగా తింటుంటారు. ఇటువంటి అలవాట్ల వల్ల పిల్లల ఆరోగ్యం త్వరగా దెబ్బతింటుంది. కాబట్టి ఇంటి దగ్గర తయారు చేసినవే పిల్లలకు ఆహారంగా ఇవ్వాలి. ముఖ్యంగా తాగు నీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి.

పారిశుద్ధ్య లోపంతో..

జ్వరాలు ప్రబలడానికి ముఖ్య కారణం పారిశుద్ధ్య లోపం. ఎక్కడ చూసినా డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం పడిన సమయంలో మురుగునీరు, వర్షం నీరు కలిసి రహదారులపై ప్రవహిస్తోంది. కొన్ని చోట్ల ఇళ్లల్లోకి కూడా వర్షం నీరు, మురుగునీరు కలిసి రావడం వలన వ్యాధులు త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అధికారుల కోసం ఎదురు చూడకుండా ఎవరి ఇంటి పరిసరాలలో వారు మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వైద్యుల సూచనలు..

- సాధ్యమైనంత వరకు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- తాజాగా ఉండే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి.
- నిల్వ ఉన్న ఆహారాన్ని ఏ మాత్రం తిన కూడదు.
- మాంసాహార తినుబండారాలను సాధ్యమైనంత వరకు తగ్గించాలి.
- పరిసరాల పరిశుభ్రత పాటించాలి. బహిరంగ మలమూత్ర విసర్జన చేయకూడదు. మల మూత్ర విసర్జన అనంతరం చేతులను శుభ్రపరుచుకోవాలి.
- డ్రైయినేజీల్లో నీరు నిల్వ ఉన్న చోట కిరోసిన్ లేదా బ్లీచింగ్ తరచూ చల్లుతూ ఉండాలి.
- వర్షంలో తడవకుండా రెయిన్‌కోటు, గొడుగు వంటివి వాడాలి.
- ఇంటి పరిసర ప్రాంతాలలో కుండ పెంకులు, కొబ్బరి చిప్పలలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి.
- ఇంటి నుంచి బయటకు వెళ్తున్న సమయంలో మాస్క్‌లు తప్పనిసరిగా కట్టుకోవాలి. శానిటైజర్లతో చేతులు ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి.
- సాధ్యమైనంత వరకు పిల్లలను బహిరంగ ప్రదేశాల్లో తిరగకుండా చర్యలు తీసుకోవాలి.

ఈ జాగ్రత్తల పాటించడం వలన వ్యాధులు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

పరిశుభ్రత అవసరం



వర్షాలు పడుతున్నందు వల్ల వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలి. వర్షాకాలంలో మురుగు నీరు, చెత్తా చెదారం ఎక్కువగా నిల్వ ఉన్న చోట దోమలు, ఈగలు చేరుతాయి. వీటివల్ల డయేరియా, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. వర్షంలో తడవడం వల్ల దగ్గు, జలుబు వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. పిల్లలకు జ్వరాలు త్వరగా సోకే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ ప్రసన్నరాణి,
జి.కొండూరు మండల వైద్యాధికారి

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

తిరువూరురూరల్: మండలంలోని సర్పంచులకు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు శిక్షణ ఇస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, సూక్ష్మ ప్రణాళిక, పరిపాలనపై శిక్షణ ఇస్తామన్నారు. పంచాయతీ విస్తరణాధికారి వెంకటరత్నం పాల్గొన్నారు.

- ముసునూరు: మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లకు, గ్రేడ్–1 నుంచి గ్రేడ్– 5 కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ పద్మావతీదేవి తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ శుక్ర, శనివారాల్లో గ్రామ పంచాయతీ పరిపాలన, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమగ్ర శిక్షణ ఇస్తామని వివరించారు.
- జి.కొండూరు: మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, గ్రేడ్-1, 5 కార్యదర్శులకు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు పాటు స్థానిక కమ్యూనిటీహాల్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్క్రూటినీ, స్ట్రీట్ లైటింగ్ తదితర అంశాలపై ఉదయం 9 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

సాయిబాబా ఆలయ శంకుస్థాపన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బీకాలనీ వద్ద సాయిబాబా ఆలయం శంకుస్థాపన, ముస్లింల జెండా చెట్టు వద్ద నిసానీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, షాబూఖారీ మసీదు ఆస్థాన పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్‌రజా, అక్కల గాంధీ, బొర్రా కిరణ్ తదితరులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వరద గుప్పెట్లో లంక గ్రామాలు



పెద్దకొమిరలో కట్టలేరు వరద ముంపులో ఉన్న మామిడి తోటలు



చినలంక గ్రామానికి పడవపై వెళుతున్న గ్రామస్తులు



జూపూడిలో వరదనీరు పట్టిన మొక్కజొన్న పంట

ఇబ్రహీంపట్నం: ఓవైపు కృష్ణానదికి వరద ప్రవాహం, మరోవైపు మున్నేరు నుంచి భారీగా ప్రవహిస్తున్న వరదనీటితో చినలంక, పెదలంక గ్రామాలు వరద గుప్పెట్లో చిక్కుకున్నాయి. ఎగువన పులిచింతల ప్రాజెక్ట్ నుంచి గురువారం తెల్లవారుజాముకు భారీగా నీరు విడుదల కావడం, మున్నేరు నుంచి వరద నీరు అధికంగా ప్రవహించడంతో తెల్లవారే సమయానికి లంక గ్రామాల చుట్టూ వరదనీరు చేరింది. పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ పంట పొలాలు నీటిముంపునకు గురయ్యాయి. జూపూడి సమీపంలోని సప్టాకు సుమారు అర కిలోమీటరు వెడల్పులో నీటి ప్రవాహం చేరింది. ఆయా గ్రామాలకు పూర్తిగా రాకపోకలు స్తంభించాయి. పెదలంక గ్రామస్తులు అత్యవసర పరిస్థితుల్లో పడవల ద్వారా ఇబ్రహీంపట్నం ఫెర్రీకి చేరుకుంటున్నారు. చినలంక గ్రామస్తులు జూపూడి డొంకరోడ్డు వద్దకు చేరుతున్నారు. ఇదే మాదిరిగా వరద కొనసాగితే ఈ రాత్రికి గ్రామాల్లోకి వరదనీరు చేరే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలేశపురం, మూలపాడు వద్ద సప్టాలపైకి నీరు చేరడంతో వ్యవసాయ పొలాలకు రైతులు వెళ్లే పరిస్థితి లేదు. పశువుల మేతకు వెళ్లేందుకు అవకాశం లేదని ఆవేదన చెందుతున్నారు.

పంటలను ముంచేసిన వరద..

ఇబ్రహీంపట్నం: కృష్ణానదికి పెరిగిన వరద తాకిడికి పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాంతం నుంచి కృష్ణానదికి వస్తున్న వరదనీటితో గురువారం తెల్లవారుజామున నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. వరి, మొక్కజొన్న, పత్తి, పలు ఉద్యాన పంటలను వరదనీరు ముంచెత్తింది. ముఖ్యంగా నదీ పరీవాహక గ్రామాలైన కొటికలపూడి, కిలేశపురం, త్రిలోచనాపురం, దాములూరు, ఇబ్రహీంపట్నం, చిలుకూరు, జూపూడి, గ్రామాల్లో పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. ఏనుగుగడ్డ వాగు ఉధృతంగా ప్రవహించడంతో కనీసం పొలాల వైపు వెళ్లేందుకు కొన్ని గ్రామాల్లో దారిలేకుండా పోయింది. బెండ తోటలు వేసిన రైతులు ఒక రోజు కాపు కోయకపోతే కాయ ముదిరిపోతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

కట్టలేరులో పరవళ్లు తొక్కుతున్న వరద

గంపలగూడెం: మండలంలోని కట్టలేరులో వరద నీరు గురువారం కూడా పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఎగువ తెలంగాణ ప్రాంతంలో, స్థానికంగా పడిన భారీ వర్షాలతో ఏటిలో వరద నాలుగు రోజులుగా పారుతోంది. వినగడప– తోటమూల నడుమ ఏటిపై ధ్వంసమైన వంతెన వద్ద నిర్మించిన డైవర్షన్ రహదారిపై నాలుగు అడుగుల ఎత్తున నీరు పారుతోంది. దీంతో ఏటిపై రాకపోకలు నాలుగో రోజు నిలిచిపోయాయి. మండలంలోని పలు వాగులు, వంతెనల్లో నీటి ప్రవాహం కొంతమేర తగ్గి ఆయా రహదార్లలో రాకపోకలకు ఆటంకం తొలగిపోయింది. కట్టలేరు పరీవాహక ప్రాంతంలో సాగుచేసిన వరి పొలాలు, మామిడి తోటల్లో మాత్రం ముంపు నీరు యథావిధిగా ఉంది. వాతావరణం మార్పు చెంది తెరపిచ్చింది. దీంతో ప్రజలు బయట పనులు చేసుకునేందుకు అవకాశం కలిగింది. కట్టలేరు వద్ద ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా ఎస్ఐ ఎస్. శ్రీను పర్యవేక్షణలో ఏటికి ఇరువైపులా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పిల్లల పెంపకంలో జాగ్రత్త వహించాలి



గంపలగూడెంలో మాట్లాడుతున్న జీవన్‌కుమార్

గంపలగూడెం: పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకుని వారు పెడతోవ పట్టకుండా మంచి జీవితాన్ని ఏర్పరచుకునేలా చూసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ ఎం. జీవన్‌కుమార్ అన్నారు. గంపలగూడెం 67వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్లోబల్ డే ఆఫ్ పేరెంట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల పెంపకంలో మెలకువలు, పరిసరాల పరిశుభ్రత, బాలల హక్కులు, ఆహారపు అలవాట్లు, సమాజం విలువ తదితర అంశాలను వివరించారు. సర్పంచ్ కోట పుల్లమ్మ పాల్గొన్నారు.

ఘనంగా మదర్స్‌డే వేడుకలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సెక్టార్ సూపర్‌వైజర్ జి.రమాదేవి అన్నారు. మదర్స్ డే వేడుకలు కొండపల్లిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి పోషకాహారం అందిస్తూ నైతిక విలువలు కలిగిన బిడ్డలుగా పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. చిన్నతనం నుంచే వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులతో తల్లులకు వందనం చేయించారు. తల్లులు బిడ్డలకు ఆశీర్వాదం అందజేశారు. పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలోని మొత్తం 154 మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ హైస్కూళ్లలో చైర్మన్, వైస్ చైర్మన్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారని విద్యాశాఖాధికారులు తెలిపారు. నూతన కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కమిటీల ఎన్నిక ఏకపక్షంగా సాగినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వ మద్దతుదారులే కమిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా ఎంపికయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టీడీపీ నేతల బెదిరంపులతో వాగ్వాదం

రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను బెదిరించి తాము ప్రతిపాదించిన అభ్యర్థికి చేతులు ఎత్తాలని హుకుం జారీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జోక్యం చేసుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఎస్ఐ గోవిందు ఘటనా స్థలానికి చేరుకున్నప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో మైలవరం సీఐ చంద్రశేఖర్ అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పాత నాగులూరు ఎంపీపీ స్కూల్‌లో సభ్యులు హాజరుకాకపోవడంతో ఎన్నిక వాయిదా పడింది.

- నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలోని మొత్తం 248 పాఠశాలలు ఉండగా 247 పాఠశాలలకు గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఒక స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక వాయిదా పడింది.
- తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో 248 పాఠశాలలు ఉన్నాయి. ఎస్ఎంసీ కమిటీలకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. తిరువూరు సర్వోదయ ఎయిడెడ్ యూపీ స్కూల్ యాజమాన్యం ఎన్నిక నిలుపుదలకు కోర్టును ఆశ్రయించింది.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఇబ్రహీంపట్నం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ పర్వీన్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమల వలన వ్యాపించే వ్యాధులు, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను తెలిపారు. దోమలు, వ్యాధుల నివారణకు గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలపై ఏఎన్ఎంలు, ఆశాలకు అవగాహన కల్పించారు. ఫ్రై డే డ్రై డేగా పాటించాలని సూచించారు. సీహెచ్ఓ నారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే..

జి.కొండూరు: సీజనల్ వ్యాధులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేపట్టామని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నరాణి తెలిపారు. కవులూరులో వైద్య సిబ్బందితో కలిసి గురువారం ఆమె ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రసన్నరాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్యంలో ఎటువంటి మార్పులు వచ్చినా వెంటనే అనుభవజ్ఞులైన వైద్యులను సంప్రదించాలని కోరారు.



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రసన్నరాణి

బాల్య వివాహాలతో భవిష్యత్ ప్రశ్నార్థకం

బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారి దుర్గాప్రసాద్



జి.కొండూరు: వెలగలేరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు బాలల హక్కులు, యోగా ప్రాముఖ్యతపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథి బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారి వి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అటువంటి ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు ఉపాధ్యాయుల ద్వారా అధికారులకు తెలిసేలా చేయాలని సూచించారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, మానసిక ఉల్లాసం పెరిగి చదువుపై ఆసక్తి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ అన్నమ్మ, పాఠశాల హెచ్ఎం కె. పద్మ, పీడీ కె. మార్తమ్మ, ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఎస్ఐ ఎస్. శ్రీను

అర్లపాడు(గంపలగూడెం): బాలికలు చదువుతోపాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎస్. శ్రీను అన్నారు. గంపలగూడెం మండలం అర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలియని వ్యక్తులతో మాట్లాడవద్దని, కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లను వివరించారు. ప్రభుత్వం బాలికల సంరక్షణకు ప్రత్యేక చట్టాలను రాజ్యాంగం ద్వారా అమలు చేస్తోందని చెప్పారు. క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్ ఎడమ కాలువ నీటితో చెరువులు నింపాలి

మైలవరం: నాగార్జున సాగర్‌లో ఎక్కువైన నీటిని సాగర్ ఎడవ కాలువ ద్వారా మైలవరం నియోజకవర్గంలోని చెరువులు నింపాలని కిసాన్ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పి. వెంకటేశ్వరరావు, నాయకులు పత్తి సాయి దశరథ, నాగరాజు, శేఖర్, నరేంద్ర, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు ప్రారంభం



మూలపాడు(ఇబ్రహీంపట్నం): వ్యవసాయ పంటలకు ఈ–క్రాప్ నమోదు కార్యక్రమం మూలపాడు గ్రామంలో గురువారం ప్రారంభమైంది. వీఏఏ యు. సాయికిరణ్ వరి, మొక్కజొన్న తదితర పంటలకు పొలం యజమానుల సమక్షంలో ఈక్రాప్ నమోదు చేశారు. ఈ క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వం అందించే అన్నిరకాల వ్యవసాయ పథకాలకు అర్హులు అవుతారని ఆయన వివరించారు. పంటల బీమా, వడ్డీలేని పంట రుణాలు, కొనుగోలు కేంద్రాల్లో పంటల ఉత్పత్తుల అమ్మకాలకు అవకాశం కల్పిస్తారన్నారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు

చాట్రాయి: మండలంలోని ఆరుగొలనుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మమ్మ అంకమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా గురువారం అమ్మవార్లను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజలు చేసి సాయంత్రం అమ్మవార్లను గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవార్లకు పూజలు చేశారు. శుక్రవారం అమ్మవార్ల ఆలయ ప్రతిష్ఠ చేయనున్నారు



గంపలగూడెంలో పారిశుద్ధ్య పనులు

గంపలగూడెం: గంపలగూడెంలోని పలు ప్రాంతాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు గురువారం నిర్వహించారు. పటమట దళితవాడ, కాపుల వీధి, వర్తక సంఘం ఏరియాల్లో కచ్చా డ్రెయినేజీల్లో పూడిక తొలగించారు. సర్పంచ్ కోట పుల్లమ్మ, ఈఓ జి. శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. కాగా ఇళ్ల ముందు కచ్చా, పక్కా డ్రెయినేజీలను ఆక్రమించుకుని ఏర్పాటు చేసుకున్న ర్యాంపులు, మేరువుల తొలగింపునకు పంచాయతీ ప్రత్యేక దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళి

మైలవరం: పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి బుద్ధదేవ్ భట్టాచార్య చేసిన సేవలు ప్రశంసనీయమని సీపీఎం నియోజకవర్గ నాయకులు ఆర్. రమేష్‌బాబు అన్నారు. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఆర్. రమేష్‌బాబు, సీహెచ్ సుధాకర్, ముఠా కార్మికులు అమరేశ్వరరావు, చెన్నారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలి

నూజివీడు: డివిజన్‌లోని గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలపై ఉందని డీఎల్‌పీఓ సుందరి అన్నారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణపై గురువారం మండలంలోని పాత రావిచర్లలో ఉన్న సంపద సృష్టి కేంద్రం వద్ద శిక్షణ ఇచ్చారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎరువుగా మార్చే ప్రక్రియను ఈ సందర్భంగా వివరించారు. ప్రతి రోజూ గ్రామంలోని చెత్తను సేకరించి సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.

పెద్దవరంలో ప్రత్యేక వైద్య శిబిరం

పెద్దవరం(తిరువూరురూరల్): మండలంలోని పెద్దవరంలో రాజుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని జ్వర పీడితులను గుర్తించేందుకు సర్వే నిర్వహించడంతో పాటు జ్వరంబారిన పడిన వారికి వైద్యపరీక్షలు జరిపారు. అన్ని గ్రామాల్లో జ్వరాలు అదుపులో ఉన్నాయని, డెంగీ కేసులు నమోదు కాలేదని, పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా దోమల నిర్మూలనకు ఫాగింగ్, ఎబేట్ మందు పిచికారీ చేస్తున్నామని రాజుగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి చలపతిరావు తెలిపారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ చంద్రమోహన్, హెల్త్ విజిటర్ ఫ్లోరెన్స్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.